నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, మంగళవారం 2 ఏప్రిల్ 2024 | KHAMMAM

ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు

ప్రభుత్వ అసమర్థతతోనే ఎండుతున్న రైతుల పంటలు

తీవ్రంగా సాగు, తాగునీటి సమస్య : ఖమ్మం ఎంపీ నామా

మాయమాటలతో అధికారంలోకి.. : ఎమ్మెల్సీ తాతా మధు

తీగలబంజర గ్రామంలో ఎండిపోయిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎంపీ నామా, ఎమ్మెల్సీ తాతా మధు

కొణిజర్ల, ఏప్రిల్ 1 : కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్లే పంటలు ఎండిపోతున్నాయని, ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువు అని లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తీగలబంజర గ్రామంలో రైతు భుక్యా శ్రీనుకు చెందిన మూడెకరాల్లో ఎండిపోయిన మొక్కజొన్న పంటను ఎంపీ నామా.. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ నామా మాట్లాడుతూ సాగునీరు అందక చేతికొచ్చిన పంటలు ఎండిపోతుంటే సర్కారు చోద్యం చూస్తోందన్నారు. ఒక్క తడికి సాగునీరు అందించలేని సర్కారు కనీసం పంట నష్టాన్ని కూడా పరిశీలించే పరిస్థితి లేదన్నారు. ఇంత కన్నా లోటు వర్షపాతం నమోదైనప్పుడు సాగునీరు అందించిన సందర్భాలు గత కేసీఆర్ సర్కారు హయాంలో ఉన్నాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాలతో 4 నెలల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, భూగర్భ జలాలు అడుగంటి చుక్కనీరు అందే పరిస్థితి లేదన్నారు. ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం రైతాంగానికి అందించాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజన రైతు భూక్యా శ్రీను అనారోగ్యంతో బాధపడుతూ మూడెకరాల్లో పంట సాగు చేసి రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టాడని, వెంటనే ఆ రైతును ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మాయమాటలతో అధికారంలోకి.. : ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

మాయమాటలు, అమలుకు నోచుకోని వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతున్నదని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. రాష్ట్రంలో సాగునీరే కాదు.. తాగునీరు కూడా లభించే పరిస్థితి లేదన్నారు. పాలేరు వంటి రిజర్వాయర్లు నిలువునా ఎండిపోయే పరిస్థితి ఉన్నదని, పాలేరు చరిత్రలో ఇంత దుర్మార్గమైన పరిస్థితులు మునుపెన్నడూ లేవన్నారు. రైతులెవరూ అధైర్యపడొద్దని, భవిష్యత్‌లో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పోట్ల కవిత, బీఆర్ఎస్ నాయకులు ఏలూరి శ్రీనివాసరావు, బోడపోతుల బాబు, దొడ్డపునేని రామారావు, చెరుకుమల్లి రవి, చల్లా మోహన్‌రావు, రాయల నాగేశ్వరరావు, పోగుల శ్రీను, పాసంగులపాటి శ్రీను, ధరావత్ మాన్సింగ్, భూక్యా మీటు, కట్టా కృష్ణార్జునరావు, వనమా విశ్వేశ్వరరావు, దామా విజయ్, తాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి సాగర్ జలాలు

రేపు మధ్యాహ్నం వరకు పాలేరుకు చేరనున్న నీరు

నీటి ట్యాంపరింగ్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు

6 అడుగుల అట్టడుగు స్థాయికి చేరిన పాలేరు నీరు



మిషన్ భగీరథ ఇన్‌టేక్ వెల్ వరకు అడుగంటిన పాలేరు రిజర్వాయర్

కూసుమంచి, ఏప్రిల్ 1 : ప్రజల తాగునీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ నుంచి పాలేరు రిజర్వాయర్‌కు సోమవారం రాత్రి 2,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. క్రమంగా 4 వేల క్యూసెక్కుల వరకు పెంచి 3,500 క్యూసెక్కుల నీరు వచ్చే విధంగా అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట, వరంగల్, ములుగు జిల్లాలోని 2,435 గ్రామాలకు పాలేరు, మాదిరిపురం, సూర్యాపేట ఇన్‌టేక్ వెల్ నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు. నీటిని పొదుపుగా వాడుకోవడంతోపాటు జూన్ చివరి వరకు జాగ్రత్తగా వాడుకునే విధంగా మిషన్ భగీరథ అధికారులు చర్యలు చేపట్టారు. సాగర్ నుంచి సుమారు 3 టీఎంసీల వరకు తీసుకోవాలని నిర్ణయించారు. ఇవి పాలేరుకు చేరే వరకు సుమారు 2 టీఎంసీలైనా వచ్చే విధంగా చూడాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు.

సాగర్ నుంచి కాలువపై గస్తీ..

పాలేరు నుంచి ఐదు జిల్లాలకు తాగునీరు ఇస్తున్నందున ప్రతి నీటిబొట్టు వృథా కాకుండా జిల్లాస్థాయిలో కలెక్టర్లు.. ఇరిగేషన్, మిషన్ భగీరథ, పోలీస్, రెవెన్యూ, ఐడీసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడా నీటి చోరీ జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు కాలువపై 24/7 గస్తీ ఏర్పాటు చేశారు. పాలేరుకు వచ్చే నీటిని ట్యాంపరింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవనే ఆదేశాలు జారీ చేశారు. సాగర్‌లో కూడా నీరు లేని కారణంగా ఈ దఫా ఇచ్చే నీటితోనే ఐదు జిల్లాలకు వేసవి పూర్తయ్యే వరకు తాగునీరు అందించాల్సి ఉంటుంది.

చరిత్రలో అట్టడుగు స్థాయికి నీటిమట్టం

పాలేరు రిజర్వాయర్‌గా మారిన తర్వాత 50 ఏళ్ల కాలంలో ఇప్పటివరకు అట్టడుగు స్థాయి నీటిమట్టం 6 అడుగులకు పడిపోయింది. అయితే సాగర్ నుంచి నీరు వచ్చే వరకు మరో 38 గంటలు పట్టే అవకాశం ఉన్నందున పాలేరు 5.5 అడుగుల అట్టడుగు స్థాయి వరకు పడిపోనున్నది. కాగా.. సాగర్‌లో వదిలిన నీరు క్రమంగా పాలేరు రిజర్వార్‌కు రావడానికి సుమారు 38 గంటల సమయం పడుతుంది.

వేళకు పౌష్టికాహారం అందించాలి

ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

పాల్వంచ, ఏప్రిల్ 1 : ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా హాస్టళ్లలో ఉండి చదువుతున్న విద్యార్థులకు సమయానికి మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం పాల్వంచలోని కిన్నెరసాని బాలుర ఆశ్రమ పాఠశాలను ఉమ్మడి ఖమ్మం జిల్లా ట్రైనీ కలెక్టర్ యువరాజ్ మర్మాడ్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, వంటశాల, డైనింగ్ హాల్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఒక్కపూటే తరగతులు నడుస్తున్నందున మధ్యాహ్నం పూట పిల్లలను ఎవరినీ బయటకు పంపొద్దని, ఎండలు ఎక్కువగా ఉన్నందున వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం చందు, ఉపాధ్యాయులు రవి, సురేశ్, పీఈటీలు వీరన్న, వాసు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు సమాయత్తం

- **పక్కాగా ఎన్నికల కోడ్ అమలు**
- **జిల్లావ్యాప్తంగా చెక్‌పోస్టులు, విస్తృతంగా వాహన తనిఖీలు**
- **కొత్త ఓటర్ల నమోదుకు ఈ నెల 29 వరకు అవకాశం**

మణుగూరులో ఓటు హక్కుపై అవగాహన కోసం ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్నికల అధికారులు

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సమాయత్తమవుతున్నది. ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదలైన వెంటనే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఎన్నికల విధులు, కోడ్ పరిశీలనకు 5,629 మంది నియమితులయ్యారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లాలోని ఐదు నియోజకవర్గాల అసిస్టెంట్ ఎన్నికల అధికారులు సభలు, సమావేశాలు, అవగాహన సదస్సులు ప్రారంభించారు. కలెక్టర్ ప్రియాంక ఆల ఐదు నియోజకవర్గాలకు ఐదుగురు ఏఆర్వోలను నియమించారు. వీరు ఎన్నికల విధి విధానాలపై రాజకీయ నాయకులకు అవగాహన కల్పిస్తూ, ఓటు హక్కుపై వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాలపై ఎక్కువ దృష్టి సారిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన విధంగానే పార్లమెంట్ ఎన్నికల్లోనూ వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్ద నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకుంటారు. జిల్లాలో 85 ఏళ్లు దాటిన వృద్ధులు 6,481 మంది ఉండగా.. దివ్యాంగులు 14,021 మంది ఉన్నారు. వీరంతా ఇంటి నుంచే తమ ఓటు వేయనున్నారు.

ఎన్నికల ఖర్చుపై నిఘా..

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన మరుక్షణం నుంచే యంత్రాంగం వీధుల్లోని రాజకీయపరమైన ఫ్లెక్సీలను తొలగింపజేసింది. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయించింది. కోడ్ పర్యవేక్షణకు ఐదుగురు అసిస్టెంట్ ఎక్స్‌పెన్‌డీచర్ అబ్జర్వర్లు, ఐదుగురు అకౌంటెంట్లు, 30 మంది ఎంసీసీ కమిటీ, 16 మంది ఫ్లయింగ్ స్క్వాడ్స్, 15 మంది స్టాటిక్ సర్వెలెన్స్ సిబ్బంది, 18 మంది వీడియో సర్వెలెన్స్ సిబ్బందితో పాటు ఇతర సభ్యులు నియమితులయ్యారు. ఇప్పటికే వీరంతా విధుల్లో నిమగ్నమై పనిచేస్తున్నారు.

కొత్త ఓటర్లకు ఈ నెల 29 వరకు అవకాశం..

ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ ఊపందుకున్నది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ఓటర్ల నమోదు ప్రక్రియ జరిగినప్పటికీ ఎన్నికల కమిషన్ పార్లమెంట్ ఎన్నికలకూ కొత్త ఓటర్లకు అవకాశం ఇస్తున్నది. కొత్త ఓటర్లు ఫారం-6 నింపి ఈ నెల 29లోపు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉన్నది. కలెక్టర్ జిల్లావ్యాప్తంగా 1,095 పోలింగ్ కేంద్రాలను ఎన్నికలకు సిద్ధం చేయిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో జిల్లా వ్యాప్తంగా మొత్తం 9,84,629 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళలు 5,06,471 మంది, పురుషులు 4,78,098 మంది, ఇతరులు 60 మంది. కొత్త ఓటర్లు ఓటు హక్కు పొందిన తర్వాత ఈ సంఖ్య మరింత పెరగనున్నది.

జిల్లాలో 1,095 పోలింగ్ కేంద్రాలు..

పార్లమెంట్ ఎన్నికలకు జిల్లాలో 1,095 పోలింగ్ కేంద్రాలు కేటాయించాం. వాటి పరిధిలో పీవోలు 1,401, ఏపీవోలు 1,401 మంది, ఓపీవోలు 2,827 మంది విధులు నిర్వర్తిస్తారు. పినపాక మండలంలో మరో 9 కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– ప్రియాంక ఆల, భద్రాద్రి కలెక్టర్

పకడ్బందీగా ఎన్నికల కోడ్..

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో యంత్రాంగం పకడ్బందీగా ఎన్నికల కోడ్‌ను అమలు చేస్తున్నది. పోలీసులు చెక్‌పోస్టులు, ప్రధాన రహదారి మార్గాల్లో విస్తృతంగా వాహన తనిఖీలు చేపడుతున్నారు. రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లే వారి నుంచి నగదు తీసుకుని సీజ్ చేస్తున్నారు. ఎన్నికల కోడ్, ఓటు హక్కు విలువపై అధికారులు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమాల్లో ఉన్నతాధికారులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేస్తున్నారు.

ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కొత్తగూడెంలో పోలీసుల కవాతు

కేసీఆర్ ప్రజల్లోకి వస్తుంటే.. మంత్రులకు భయం పట్టుకుంది

- **అందుకే బీఆర్ఎస్ అధినేత గురించి అడ్డగోలుగా మాట్లాడుతున్నారు**
- **అయినా కేసీఆర్‌ను విమర్శించే అర్హత కాంగ్రెస్ మంత్రులకు అసలే లేదు**
- **వారు గతాన్ని మరిచి మాట్లాడుతుండడంతో ప్రజలు నవ్వుకుంటున్నారు**
- **మంత్రుల విమర్శలకు 'రేగా' కౌంటర్.. సోషల్ మీడియాలో పోస్టులు..**

మాట్లాడుతున్న బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరు టౌన్, ఏప్రిల్ 1: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ప్రజల్లో ఆదరణ ఏమాత్రమూ తగ్గలేదని, అడుగడుగునా ప్రజల నీరాజనాలు అందుతుండడమే ఇందుకు నిదర్శనమని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రజల్లోకి వస్తుంటే కాంగ్రెస్ మంత్రులకు భయం పుట్టుకొస్తోందని విమర్శించారు. అందుకే అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. రైతుల పంటల పరిశీలన కోసం ఉమ్మడి నల్లగొండలోని సూర్యాపేట జిల్లాలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇటీవల పర్యటించడం, ప్రభుత్వ తీరును ఎండగట్టడం వంటి అంశాలపై నల్లగొండ జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు రేగా కాంతారావు సోమవారం సోషల్‌మీడియా వేదికగా కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రజల్లోకి వస్తే తమకు ఎక్కడ ఆదరణ పోతుందోనని భయం కాంగ్రెస్ మంత్రులకు పట్టుకుందని విమర్శించారు. అందువల్లనే వారు ఆవేశం, ఆందోళనతో ఇష్టారీతిన వ్యాఖ్యలు చేస్తున్నారని దుయ్యబట్టారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఇన్నేళ్ల కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులుగా నల్లగొండలోనే ఫ్లోరైడ్ భూతాన్ని ఎందుకు పట్టించుకోలేదని విమర్శించారు. ఫ్లోరైడ్ సమస్యతో ప్రజల జీవితాలతో ఆడుకున్నందుకు సిగ్గుపడాల్సింది పోయి కేసీఆర్‌పై ఎదురుదాడి చేస్తుండడం హేయమైన చర్య అని అన్నారు. పైగా తమ పాపాలు మరిచి నీతివ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. మంత్రులు చేసిన ఇలాంటి వ్యాఖ్యలను చూసి ప్రజలు కూడా నవ్వుకుంటున్నారని అన్నారు. నల్లగొండ జిల్లా ఫ్లోరైడ్ భూతాన్ని పారదోలి ప్రజల దాహార్తిని తీర్చిన ఘనత కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. సాగర్ జలాలను నల్లగొండ ప్రజలకు అందించడం చేతకాని కాంగ్రెస్ మంత్రులకు కేసీఆర్‌ను విమర్శించే అర్హత లేదని అన్నారు. ఉమ్మడి నల్లగొండను మూడు జిల్లాలుగా చేసి మూడు మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కరెంటు లేక చీకట్లు అలుముకుంటే.. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక 4 వేల మెగావాట్ల యాదాద్రి పవర్ ప్లాంటును తీసుకొచ్చారని గుర్తుచేశారు. తెలంగాణను తెచ్చిన కేసీఆర్.. పదేళ్లపాటు సీఎంగా సుపరిపాలన అందించారని అన్నారు. ఇప్పటి కాంగ్రెస్ మంత్రులు చెబుతున్న అబద్ధాలను, చేస్తున్న మోసాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలే వారికి తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. కాగా, కాంగ్రెస్ తీరును ఎండగడుతూ రేగా చేసిన పోస్టులు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నాయి.

ఎన్నికల విధులపై అవగాహన ఉండాలి

ఖమ్మం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్

మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం, ఏప్రిల్ 1 : ఎన్నికల విధులు, బాధ్యతలపై ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు పూర్తిస్థాయి అవగాహన ఉండాలని ఖమ్మం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. సోమవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఎస్ఆర్అండ్‌బీజీఎన్ ఆర్ కళాశాలల్లో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహిస్తున్న ఎన్నికల శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ విధులు, ఈవీఎం యంత్రాల పనితీరుపై పూర్తి అవగాహన పొందాలన్నారు. పోలింగ్ ప్రారంభానికి 90 నిమిషాల ముందు ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించే విధానంపై వారికి వివరించాలన్నారు. బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను పోలింగ్ కేంద్రాల్లో అమర్చడంపై అవగాహన ఉండాలన్నారు. పోలింగ్ స్టేషన్ ప్రాంతం, ఓటర్ల వివరాలు తెలిపే నోటీసు బోర్డులు, ఫారం-7లో పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను పోలింగ్ స్టేషన్ ఎదుట ప్రదర్శించాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది ఫారం-12ఏ, ఫారం-12 ద్వారా ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్, పోస్టల్ బ్యాలెట్‌లు పొంది, కచ్చితంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. గత ఎన్నికల అనుభవాల దృష్ట్యా ఏమైనా పొరపాట్లు ఉంటే సరిదిద్దుకొని ఎన్నికల నిర్వహణ వంద శాతం విజయవంతం చేయాలన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పోలింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించి, ఈవీఎం యంత్రాలతో హాండ్స్ ఆన్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, ఎస్డీసీ ఎం.రాజేశ్వరి, ఆర్డీవో జి.గణేశ్, జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.శ్రీరామ్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి అవగాహన అవసరం

శిక్షణా కేంద్రాలను సందర్శించిన భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక

శిక్షణా కేంద్రాలను సందర్శించి మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది ఈవీఎం, వీవీప్యాట్ల వినియోగంపై అవగాహన పెంచుకోవాలని భద్రాద్రి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. సోమవారం కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల, లక్ష్మీదేవిపల్లిలోని శ్రీరామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బందికి ఫారం-12, ఫారం-12ఏలను శిక్షణ నిర్వహించే కేంద్రాల్లోనే అందిస్తామన్నారు. అదే నియోజకవర్గంలో ఎన్నికల విధులు కేటాయిస్తే వారు ఈడీని తెలుసుకోవడం ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఫారం-12ఏలను అందజేయాలన్నారు. మరో నియోజకవర్గంలో విధులు కేటాయించినట్లైతే వారు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం-12 ద్వారా ధరఖాస్తు చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రంలో నమోదైన ఓట్ల వివరాలను ప్రిసైడింగ్ అధికారులు 17సీ ద్వారా, రిజిస్టర్ ఆఫ్ ఓటర్లు వివరాలను 17ఏ ద్వారా తెలియజేయాలన్నారు. పోలింగ్ కేంద్రంలో ఈడీసీ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్న ఓటరు వివరాలను కూడా నమోదు చేయాలన్నారు. మొదటి శిక్షణ కార్యక్రమానికి కొత్తగూడేనికి 277 మంది, అశ్వారావుపేట 282, ఇల్లెందు 240, పినపాక 270, భద్రాచలంకు 210 మంది.. మొత్తం 1,279 మందికి.. 90 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మాస్టర్ ట్రైనర్స్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌వోలు మధు, ఏఆర్‌వో కాశయ్య, భూమి కొలతల శాఖ ఏడీ కుసుమకుమారి, ఇరిగేషన్ ఈఈ అర్జున్‌రావు, తహసీల్దార్‌లు రవికుమార్, తహసీల్దార్ పుల్లయ్య, తహసీల్దార్ శిరీష పాల్గొన్నారు.

టెన్త్ వాల్యుయేషన్ వారమే..

జిల్లాకు తగ్గిన పేపర్ల కేటాయింపు

అత్యధికంగా ఇంగ్లిష్, అత్యల్పంగా సోషల్ పేపర్లు

సెయింట్ జోసెఫ్‌లో రేపటి నుంచి 9వ తేదీ వరకు టెన్త్ స్పాట్

ఖమ్మం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 1 : పదో తరగతి వార్షిక పరీక్ష పేపర్లు తగ్గడంతో వాల్యుయేషన్ ప్రక్రియకు సమయం కూడా తగ్గింది. రెండేళ్ల నుంచి స్పాట్ వాల్యుయేషన్ విధానం సులువుగా మారింది. గతంలో 6 లక్షల సమాధాన పత్రాలు వాల్యుయేషన్ చేయాల్సి వస్తే.. ఈ ఏడాది కేవలం 2,10,840 మాత్రమే కేటాయించారు. జిల్లాకు తగ్గిన పేపర్లతో స్పాట్ వాల్యుయేషన్‌కు వారం రోజులు మాత్రమే పట్టనున్నది.

ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు..

నగరంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో పదో తరగతి మూల్యాంకనం ప్రక్రియ ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు సాగనున్నది. తొలుత పరీక్షల విభాగం అధికారులు ఈ నెల 12వ తేదీ వరకు నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించినా.. జిల్లాకు పేపర్లు తక్కువగా కేటాయించడంతో వాల్యుయేషన్ వారం రోజుల్లో ముగియనున్నది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను విద్యాశాఖాధికారులు పూర్తి చేశారు. కోడింగ్ ప్రక్రియ పూర్తయింది. సీఈలు, ఏఈలు, స్పెషల్ అసిస్టెంట్లకు ఆర్డర్లు సైతం అందజేశారు.

అత్యధికంగా ఇంగ్లిష్ పేపర్లు..

జిల్లాకు అత్యధికంగా ఇంగ్లిష్ సబ్జెక్ట్‌కు సంబంధించిన పేపర్లు కేటాయించారు. ఇంగ్లిష్‌లో 45,339 పేపర్లు కాగా.. అత్యల్పంగా సోషల్ స్టడీస్‌లో 15,980 పేపర్లు ఉన్నాయి. తెలుగులో 30,265, హిందీ 32,142, గణితం 20,423, ఫిజికల్ సైన్స్ 36,012, బయాలజీలో 30,319 పేపర్లు కేటాయించారు. వీటి వాల్యుయేషన్ పూర్తి చేసేందుకు డిమాండ్‌కు అనుగుణంగా ఇంగ్లిష్ సబ్జెక్ట్‌కు అత్యధికంగా ఏఈ(అసిస్టెంట్ ఎగ్జామినర్స్) 126 మందిని నియమించారు. సీఈలు 100 మంది, ఏఈలు 585, స్పెషల్ అసిస్టెంట్లు 200 మంది విధుల్లో పాల్గొన్నారు. వీరిలో సబ్జెక్ట్‌లవారీగా ఏఈలు తెలుగు 84, హిందీ 89, ఫిజికల్ సైన్స్ 100, బయాలజీ 84, సోషల్ 45, గణితం పేపర్లను 57 మంది వాల్యుయేషన్ చేయనున్నారు.

మొబైల్ ఫోన్లకు అనుమతి లేదు

స్పాట్‌లో పాల్గొనే ఉపాధ్యాయులు మొబైల్ ఫోన్ వాడేందుకు అనుమతి లేదని ఇప్పటికే డీఈవో సోమశేఖర శర్మ ఆదేశించారు. స్పాట్ జరిగే ప్రాంతంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎవరైనా ధర్నాలు, అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. పేపర్ వాల్యుయేషన్‌లో అప్రమత్తంగా ఉండాలని, రీవాల్యుయేషన్‌లో మార్కులు పెరిగితే తప్పుగా వాల్యుయేషన్ చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని సంబంధిత అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లకు దిశానిర్దేశం చేశారు.

నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలు వెల్లడి

కూసుమంచి, ఏప్రిల్ 1 : 2024-2025 విద్యా సంవత్సరానికి పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఫలితాలను ప్రిన్సిపాల్ శ్రీనివాసులు సోమవారం విడుదల చేశారు. జనవరి 20న నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 3,140 మంది దరఖాస్తు చేసుకోగా.. అందులో 2,492 మంది పరీక్ష రాశారు. వారిలో కేటగిరీలవారీగా 80 మంది విద్యార్థులకు మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించారు.

సీట్లు సాధించిన విద్యార్థుల హాల్ టికెట్ నెంబర్లు ఇలా ఉన్నాయి. ఎం.3462774, ఎం.3464573, కె.3464 588, ఒ.3464750, ఎన్.3462849, ఎఫ్. 3463104, జె.3463221, జె.3464177, జె.3464480, కె.3462142, జి.3464496, కె.3464620, ఎల్.3464966, జె.3465050, ఎల్.3465195, ఎల్.3464775, ఎల్.3464838, ఎల్.3464965, పి.3465075, ఎల్.3565127, ఎల్.3462143, ఐ.3462379, జె.3462529, జె.3462718, ఒ.3462740, జె.3462764, జె.3463111, జె.3463140, జె.3463388, జె.3464182, ఎల్.3464272, కె.3464446, జె.3464495, ఎన్.3464557, జె.3464699, కె.3464856, ఎన్.3465068, జె.3465101, ఎన్.3465144, జె.3462951, జె.3462953, జె.3463151, జె.3463444, జె.3463941, ఎన్.3464376, జె.3463622, జె.3464634, జె.3463637, ఎల్.3463677, ఎన్.3464679, జె.3464702, జె.3464711, జె.3474746, ఎన్.3464778, ఎన్.3464780, ఒ.3462703, ఒ.3462860, కె.3462930, కె.3462966, కె.3463277, కె.3463446, ఒ.3463500, ఒ.3463594, ఒ.3464417, ఒ.3464825, పి.3462134, పి.3462208, ఎల్.3462229, పి.3462372, పి.3462730, ఎల్.3462796, ఎల్.3463236, పి.3463518, ఎల్.3463922, పి.3464298, పి.3464362, ఎల్.3464770, పి.3464873, ఎల్.3465201, ఎల్.3465205.